క్లుప్తంగా

మోదుగులకు శుభాకాంక్షలు



పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు, పల్నాడు జిల్లాల పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి, విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులుగా నియమితులైన నేపథ్యంలో శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం సోషల్ మీడియా జిల్లా అధ్యక్షుడు కొరిటెపాటి ప్రేమ్‌కుమార్, పలువురు పార్టీ నేతలు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

నగరాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

నెహ్రూనగర్: నగరాభివృద్ధిలో బిల్డర్స్ భాగస్వాములు కావాలని మేయర్ కోవెలమూడి రవీంద్ర కోరారు. నెరెడ్కో అసోసియేషన్ సభ్యులు గురువారం మేయర్‌ను ఆయన చాంబర్‌లో కలిశారు. బిల్డర్స్ ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. మేయర్ మాట్లాడుతూ నగరంలోని బిల్డర్స్ నిర్దేశిత ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణాలు చేపట్టాలని తెలిపారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

వర్గీకరణ అమలు చేయడం రాజ్యాంగ విరుద్ధం



నెహ్రూనగర్: ఎస్సీ వర్గీకరణ అమలు చేయడం రాజ్యాంగ విరుద్ధమని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం ఢిల్లీలోని కేంద్ర మంత్రి రాందాస్ అతవాలేను ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు రాష్ట్ర యూనిట్‌గా వర్గీకరణ అంశం అమలు చేయడం అంబేడ్కర్ రచించిన రాజ్యాంగానికి తూట్లు పొడవడమేనని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని 9వ షెడ్యూల్డ్‌లో చేర్చాలని ఆయన కోరారు.

అత్యాధునిక వసతులతో ఎన్టీఆర్ స్టేడియం అభివృద్ధి



నెహ్రూనగర్: ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియాన్ని అత్యాధునిక వసతులతో అభివృద్ధి చేస్తామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. గురువారం ఎన్టీఆర్ మునిసిపల్ స్టేడియంలో నెల రోజుల పాటు జరుగనున్న సమ్మర్ క్యాంపును ఆయన నగర్ కమిషనర్ పులి శ్రీనివాసులు, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గత 25 ఏళ్లుగా స్టేడియంలో సమ్మర్ క్యాంపు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని, ఇక్కడ శిక్షణ పొందినవారు ఉత్తమ క్రీడాకారులుగా ఎదిగారని తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థ ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 31వ తేదీ వరకు సమ్మర్ కోచింగ్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజు ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5:30 నుంచి 7 గంటల వరకు జరుగుతుందన్నారు. అథ్లెటిక్స్, బాస్కెట్ బాల్, స్కేటింగ్, టెన్నిస్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, యోగా–ధ్యానం, టేబుల్ టెన్నిస్, స్విమ్మింగ్ అంశాల్లో శిక్షణ ఇస్తారని తెలిపారు. ముగింపు కార్యక్రమంలో ప్రతి ఒక్కరికీ సర్టిఫికెట్లు, బహుమతులు అందిస్తామని తెలిపారు. స్టేడియంలో త్వరలో అధునాతన జిమ్, వాకింగ్ ట్రాక్ వంటి సౌకర్యాలతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్ టి. వెంకటకృష్ణయ్య, కార్పొరేటర్లు ఈరంటి వరప్రసాద్, షేక్ మీరావలి పాల్గొన్నారు.

ప్రజారోగ్య కార్మికులకు టవల్స్ పంపిణీ



నెహ్రూనగర్: మేడే సందర్భంగా ప్రజారోగ్య కార్మికులకు మానవత స్వచ్ఛంద సంస్థ టవల్స్ అందించడం అభినందనీయమని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. గురువారం తన క్యాంప్ కార్యాలయంలో ఆయన టవల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరపాలక సంస్థలో ప్రతి నెలా 3వ గురువారం కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక గ్రీవెన్స్ కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు.

కిక్‌రిసిన బార్లు, దుకాణాలు

- పెచ్చరిల్లిన మద్యపానం
- వైన్స్‌ల్లో అడ్డగోలుగా పర్మిట్ రూమ్‌లు
- పట్టించుకోని అధికారులు

పట్నంబజారు: నగరంలో మద్యం దుకాణదారులు అడ్డగోలుగా బరితెగిస్తున్నారు. అధికారుల అండదండలతో నిబంధనలకు నీళ్లొదిలేశారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టని చందంగా వ్యవహరిస్తున్న తీరు సర్వత్రా విమర్శలకు గురవుతోంది. గుంటూరు నగరంలో తూర్పు నియోజకవర్గ పరిధిలో 19, వెస్ట్ పరిధిలో 18 వైన్స్ షాపులు ఉన్నాయి. బార్ అండ్ రెస్టారెంట్లు రెండు నియోజకవర్గాల్లో 68 ఉన్నాయి.

ఏరులై పారుతున్న మద్యం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి మద్యం ఏరలై పారుతోంది. నివాసాలు, ఆలయాలు, పాఠశాలలు అనే తేడా లేకుండా అధికార పార్టీ నేతలకు దాసోహమైన అధికారులు ఇష్టానుసారంగా అనుమతులు ఇస్తున్నారు. మద్యం ఆజ్యంపై స్థానికులు విరుచుకు పడుతున్నారు. వైన్ షాపులను అడ్డుకుంటున్నారు. కొద్ది రోజుల కిందట నందివెలుగు రోడ్డులో లక్కీ వైన్స్ ఏర్పాటుపై స్థానికులు, మహిళలు, ముస్లిం పెద్దలు అడ్డుకున్నారు. మద్యం దుకాణం ఏర్పాటు వల్ల ఇబ్బందులు పడతామని చెప్పినా అధికారులు పట్టించుకోలేదు. ఎక్సైజ్ సీఐ లత వ్యవహరించిన తీరు కూడా వివాదాస్పదంగా మారింది. తాము నిబంధనలు, కొలతలు ఆధారంగానే పర్మిషన్ ఇచ్చామంటూ అడ్డుపడ్డారు. తమాషాగా ఉందా ? అంటూ స్థానికులపై ఆమె విరుచుకుపడ్డారు. ఈ క్రమంలో పలువురిపై ఇష్టానుసారంగా నోరు పారేసుకున్నారు. ఇటీవల ఓపెన్ చేసిన లక్కీ వైన్స్ వద్ద పట్టాల మాటున మద్యం తాగుతున్నారు. ఇది అధికారులకు కనబడ లేదా ? అంటూ ప్రజలు విరుచుకుపడుతున్నారు.

కాసుల కోసం కక్కుర్తి

కేవలం కాసుల కోసం కక్కుర్తి పడటంబతో పాటు, కూటమి నేతల హుకుంతో అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నందివెలుగు రోడ్డులోని లక్కీ వైన్స్ వ్యవహారంలో షాపును అసలు ఎట్టి పరిస్థితుల్లోనూ తెరవనివ్వమని స్వయానా నియోజకవర్గ ఎమ్మెల్యే నసీర్‌అహ్మద్ చెప్పారు. అనంతరం బ్యాక్ గ్రౌండ్‌లో లక్షలాది రూపాయాలు తీసుకుని వైన్స్ ఏర్పాటును అధికారుల ద్వారా చేయించారనే విమర్శలు ఉన్నాయి. కేంద్ర మంత్రి పెమ్మసాని సైతం తన వల్ల కాదంటూ చేతులెత్తేయడంపై ప్రజల అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు.



పొన్నూరు రోడ్డులో ఫుట్‌పాత్‌పై మందుబాబులు

విచ్చలవిడిగా షాపులు

వైఎస్సార్ సీపీ హయాంలో ప్రభుత్వమే వైన్ షాపులు నిర్వహించింది. ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఆయా ప్రాంతాల్లో షాపులు ఏర్పాటు చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తరువాత ధనార్జనే ధ్యేయంగా ఎక్కడబడితే అక్కడ అనుమతులు జారీ చేసింది. షాపులను అడ్డుకున్న స్థానికులపై, మహిళలను కూడా చూడకుండా పోలీసులు కూటమి నేతలు చెప్పిన విధంగా కేసులు నమోదు చేశారు. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మాత్రం చెత్తబుట్టలో పడేసి స్వామి భక్తి చాటుకున్నారనే వాదనలు లేకపోలేదు. నందివెలుగు రోడ్డు, పొన్నూరు రోడ్డులో బహిరంగ మద్యపానం జరుగుతున్నా , పాత గుంటూరు పోలీసులు ధృతరాష్ట్రుని సోదరుల్లా వ్యవహరిస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

బహిరంగ మద్యంపానం చేస్తే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించం. కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. పొన్నూరు రోడ్డు, నందివెలుగు రోడ్డుల్లో బహిరంగ మద్యంపానంపై దృష్టి సారించి, చర్యలు తీసుకుంటాం.

– షేక్ అబ్దుల్ అజీజ్
డీఎస్పీ, ఈస్ట్ సబ్ డివిజన్

కట్టడి చేస్తాం

బహిరంగ మద్యపానాన్ని కట్టడి చేస్తాం. వైన్ షాపుల వద్ద పర్మిట్ రూములకు అనుమతులు లేవు. ఉన్నట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

–అరుణకుమారి, ఎక్సైజ్ సూపరిటెండెంట్

అడ్డగోలుగా పర్మిట్ రూములు

అడ్డగోలుగా ఈస్ట్ వెస్ట్ పరిధిల్లో పర్మిట్ రూములు పెట్టుకుని, వైన్స్‌ల ముందు నిలబడి తాగుతున్నా.. అధికారులు మామూళ్ళ మత్తులో జోగుతున్నారనే ఆరోపణలు లేకపోలేదు.

- పొన్నూరు రోడ్డులో అయితే నడిరోడ్డులో బహిరంగంగా తాగేస్తున్నారు.
- శ్రీ వెంటేశ్వరవిజ్ఞాన మందిరం రోడ్డులో ఒక ఆసుపత్రి పక్కనే బార్ అండ్ రెస్టారెంట్ ఉంది.
- ఏటుకూరు రోడ్డులోని సంధ్య వైన్స్‌లో పర్మిట్ రూమ్ నిర్వహిస్తున్నారు.
- గుంటూరు రైల్వేస్టేషన్ ఎదురుగా అరండల్‌పేట ఎదురుగా ఉన్న మేఘా వైన్స్‌లో పర్మిట్ రూమ్ నడుపుతున్నారు.
- అదే రోడ్డులోని డొంకరోడ్డు వద్ద ఉన్న వైన్స్‌లో పర్మిట్ రూం, బహిరంగంగా మద్యపానం జరుగుతోంది.



అరండల్‌పేటలోని వైన్స్‌లో పర్మిట్ రూమ్

పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి

క్రైస్తవ సంఘాల నాయకులు డిమాండ్

నెహ్రూనగర్: అంతర్జాతీయ సువార్తికుడు చనిపోవడం రాష్ట్రానికి చెడ్డపేరని, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఆయన మృతిపై సమగ్ర విచారణ ఉన్నత స్థాయిలో చేపట్టి, నిజాలు నిగ్గు తేల్చాలని క్రైస్తవ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర విచారణ చేపట్టడంతో పాటు క్రైస్తవుల డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం 9వ రోజుకు చేరుకున్నాయి. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్‌సీఎం చర్చి ఫాదర్లు సంఘీభావం తెలియజేశారు. ఫాదర్ పూతోట చిన్నయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవీణ్ పగడాల మృతిపై చేసిన విచారణలో నిజాలు వెలికి రాలేదన్నారు. పూర్తిస్థాయిలో ఉన్నత స్థాయి విచారణను చేయించాలని ఆయన డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో దళిత, క్రైస్తవ సంఘాల నాయకులు కొండపల్లి విల్సన్, న్యాయవాది టీజేఎస్ శ్రీనివాసరావు, సామాజికవేత్త డాక్టర్ గోళ్లమూడి రాజసుందరబాబు, సొపాటి శాంతకుమారి, కుమ్మరిగుంట దీనమ్మ, గద్దె రత్నశ్రీ పాల్గొన్నారు.

29న సంస్మరణ సభ

పాస్టర్ ప్రవీణ్ పగడాల సంస్మరణ సభ ఈ నెల 29న నిర్వహించనున్నట్లు క్రైస్తవ సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పాస్టర్ మలెల్ల రాజు తెలియజేశారు. గురువారం లాడ్జి సెంటర్‌లో క్రైస్తవ, దళిత, మైనార్టీ, ప్రజా సంఘాల నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రవీణ్ పగడాల సంస్మరణ సభ ఈ నెల 29న సాయంత్రం 5 గంటలకు లాడ్జి సెంటర్‌లోని లూథరన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్(ఎల్ఈఎం) క్రీడా మైదానంలో ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎంపీ హర్షకుమార్, అంతర్జాతీయ సువార్తికుడు కేఏ పాల్, ఎంపీ తిరుమావలవన్, విశ్రాంత ఐఏఎస్ అధికారి విజయ్‌కుమార్ పాల్గొంటారని తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలలోని క్రైస్తవులు, దళితులు, మైనార్టీలు సంస్మరణ సభలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు షేక్ రఫీ, జీఆర్ భగత్‌సింగ్, మధిర శేషయ్య, పాతూరు సహదేవ్, రత్నప్రసాద్, భాస్కర్, స్టాలిన్, విద్యాసాగర్, విజయ్, జయసుధ పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్షల్లో మాట్లాడుతున్న ఫాదర్ చిన్నయ్య

మోదీ సభకు కార్యకర్తలు తరలిరావాలి

గుంటూరు మెడికల్: ప్రధాని నరేంద్ర మోదీ అమరావతి పనుల పునః ప్రారంభ కార్యక్రమంలో రూ. లక్ష కోట్ల పనులకు శ్రీకారం చుట్టనున్నారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ అన్నారు. గురువారం చంద్రమౌళీనగర్‌లోని బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ శుక్రవారం మధ్యాహ్నం 3గంటలకు అమరావతి రాజధాని వస్తారని తెలిపారు. కార్యకర్తలంతా తరలిరావాలని ఆయన కోరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో డబుల్ ఇంజన్ సర్కార్ అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని తెలిపారు. సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి తమనంపూడి రామకృష్ణారెడ్డి, రాష్ట్ర పబ్లిసిటీ అండ్ లిటరేచర్ కన్వీనర్ పాలపాటి రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శులు చరకా కుమార్ గౌడ్, వై.వి. సుబ్బారావు, బీజేపీ రాష్ట్ర మీడియా కో–కన్వీనర్ వెలగలేటి గంగాధర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నేతలు

శ్రామిక వర్గ రాజ్య స్థాపనకు పునరంకితం కావాలి

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

లక్ష్మీపురం: మేడే స్ఫూర్తితో శ్రామిక వర్గ రాజ్య స్థాపనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. నగర ముఠా కార్మిక సంఘం, సీపీఐ, ఏఐటీయూసీ నగర సమితుల ఆధ్వర్యంలో గురువారం ముఠా కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు చల్లా చిన్న ఆంజనేయులు అధ్యక్షతన మేడే వేడుకలు నిర్వహించారు. కార్మిక వర్గం ఐక్యంగా ఉండి పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ముందుగా ఏఐటీయూసీ పతకాన్ని నాగేశ్వరరావు ఆవిష్కరించారు. కార్మిక నేత జీవీ కృష్ణారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు అంజిబాబు, కార్మిక నాయకులు పాల్గొన్నారు.

ఎలక్ట్రిసిటీ యూనియన్ ఆధ్వర్యంలో..

విద్యుత్ రంగం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంస్థను పరిరక్షించాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. మేడే సందర్భంగా గుంటూరులో గురువారం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె. రాం ప్రభాకర్, చెన్న కేశవులు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు జి. పవన్, జిల్లా కోశాధికారి కె. రాంబాబు, స్టోర్స్ హమాలి యూనియన్ నాయకులు విల్సన్లు పతాకావిష్కరణలు చేశారు. కార్యక్రమంలో నాయకులు బాషా, సురేష్, జిలాని, తిరుపతిరావు, వేణు, నరసింహారావు, కోటి పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్ రద్దుకు ప్రతిజ్ఞ చేయాలి

లేబర్ కోడ్స్ రద్దుకై ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేసేందుకు మేడే సందర్భంగా ప్రతిజ్ఞ చేయాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. మేడే సందర్భంగా గురువారం నగరంలో ఆటోస్టాండ్‌లు, మున్సిపల్ మస్టర్ ఆఫీసులు, ముఠా అడ్డాలు, కోల్డ్ స్టోరేజ్, భవన నిర్మాణ కార్మిక అడ్డాలు, అగ్రికల్చర్ యూనివర్సిటీ లాం ఫారం, ఇతర కార్మిక వాడలలో సీఐటీయూ పతాక ఆవిష్కరణలు జరిగాయి. నగర ప్రధాన కార్యదర్శి బి .ముత్యాలరావు, జిల్లా నాయకులు, నగర అధ్యక్షులు బి.సత్యనారాయణ, ఎల్.ఎస్.భారవి, షేక్ మస్తాన్ వలి, జి. వెంకటరావు షేక్ సలీం తదితరులు మాట్లాడారు. లేబర్ కోడ్స్ ద్వారా కార్మికులను బానిసలుగా మార్చేందుకు ఎన్డీఏ ప్రభుత్వం పూనుకుందని విమర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నగర అధ్యక్షులు పూనేపల్లి శ్రీనివాసరావు, కుంభ శివయ్య, వై. ప్రభుదాస్, కారసాల కొండలు, తురక వెంకటేశ్వర్లు, రత్నకుమారి, మల్లె కోటేశ్వరరావు, గోవిందు, జాలాది చిన వెంకట స్వామి, అంజిరెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమం మరచిన కూటమి ప్రభుత్వం

కూటమి ప్రభుత్వం కార్మికుల సంక్షేమం కోసం చేసిందేమీ లేకపోగా భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేసేలా వ్యవహరిస్తోందని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బి సత్యనారాయణ అన్నారు. సంఘం ఆధ్వర్యంలో సంజీవయ్య నగర్ హైస్కూల్ వద్ద సీఐటీయూ జెండాను జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సత్యనారాయణ గురువారం ఆవిష్కరించారు. మే 20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సత్యనారాయణ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డొంక రోడ్డు సీఐటీయూ జోన్ కార్మిక సంఘం తూర్పు నగర ప్రధాన కార్యదర్శి పి.దీవెనరావు సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా కార్యాలయం వద్ద వేడుకలు

మేడే సందర్భంగా గుంటూరులో ప్రథమ సోషలిస్టు రాజస్థాపకులు లెనిన్ విగ్రహానికి సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గుంటూరు కొత్తపేటలోని జిల్లా కార్యాలయం వద్ద మే డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా అరుణ పతాకాన్ని రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ జిల్లా కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేడా హనుమంతరావు, అధ్యక్షులు ఆకిటి అరుణ్ కుమార్, నగర ఏఐటీయూసీ అధ్యక్షులు రావుల అంజిబాబు, నగర గౌరవ అధ్యక్షులు జి.సురేష్ బాబు, కార్మికులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌ల రద్దు కోసం పోరాడాలి

కార్మిక హక్కుల్ని హరించే లేబర్ కోడ్‌ల రద్దు కోసం కార్మికులు ఐక్యంగా పోరాడాలని మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు పిలుపునిచ్చారు. స్థానిక అశోక్ నగర్‌లో నిర్వహించిన మేడే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత సీపీఎం జెండాను పార్టీ సీనియర్ నాయకులు ఎ.నికల్సన్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎం.వి.ఎస్. కోటేశ్వరరావు మెమోరియల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎన్‌తాండవకృష్ణ, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు వై.కృష్ణకాంత్, స్థానిక నాయకులు సత్యనారాయణ, ఎ.కళ్యాణి పాల్గొన్నారు.

ఎల్ఐసీ కార్యాలయం వద్ద వేడుకలు

కొరిటెపాడు(గుంటూరు): అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా ఎల్ఐసీ ఉద్యోగులు అరండల్‌పేటలోని కార్యాలయం వద్ద గురువారం వేడుకలు నిర్వహించారు. మచిలీపట్నం డివిజన్ సంయుక్త కార్యదర్శి వీవీకే సురేష్ ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ పతాకాన్ని ఆవిష్కరించారు. డివిజన్ ఉపాధ్యక్షుడు కౌసర్ జానీ, ఆర్.వి.ఎస్. శ్రీనివాస్, జె.రాజేంద్ర ప్రసాద్, ఎం.రాజేశ్వరరావు, కె.సీతారామాంజనేయులు, వి.కృష్ణంరాజు, ఉదయ భాను, సుబ్రహ్మణ్యం, పి.శ్రీనివాసరావు, కె.కోటేశ్వరరావు, రామస్వామి పాల్గొన్నారు.

ప్రైవేటీకరణతో ఉద్యోగ భద్రత కరువు

గుంటూరు ఎడ్యుకేషన్ : ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ భద్రత లేకుండా చేస్తున్నాయని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ఆరోపించారు. గురువారం మేడే సందర్భంగా బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ప్రపంచ కార్మిక దినోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటీకరణ విధానాలను ప్రవేశపెట్టి భద్రత లేని ఉద్యోగాలను ఇస్తున్నాయని, కార్మిక శక్తి సంఘటితమై ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం. కళాధర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ హక్కుల కోసమే కాకుండా సమాజంలోని కార్మిక, కర్షక పోరాటాలకు మద్దతుగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షురాలు ఏఎన్ కుసుమ కుమారి, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు టీఎస్ఎల్ మల్లేశ్వరరావు, రాష్ట్ర ప్రచురణ విభాగ చైర్మన్ ఎం .హనుమంతరావు, జిల్లా గౌరవాధ్యక్షుడు పీవీ శ్రీనివాసరావు, జిల్లా సహాధ్యక్షులు జి. వెంకటేశ్వర్లు, వై.నాగమణి, జిల్లా కోశాధికారి ఎండీ దౌలా పాల్గొన్నారు.



నగర సమితి ఆధ్వర్యంలో ప్రదర్శన



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు



సీఐటీయూ పతాకావిష్కరణ నేతలు



పతకావిష్కరణ చేస్తున్న ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్



జెండాను ఆవిష్కరిస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ



సీపీఐ జిల్లా కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న నేతలు



ఎల్ఐసీ కార్యాలయం వద్ద పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నేతలు

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి



లక్ష్మీపురం: ప్రజాక్షేమమే పరమావధిగా, ఉద్యమమే ఊపిరిగా, ప్రజాసేవకు అంకితమైన నిష్కలంక దేశభక్తుడు పుచ్చలపల్లి సుందరయ్య అని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి కొనియాడారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం సుందరయ్య జయంతి ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్యావేత్త ఆర్.వి.సింగరయ్య, సీహెచ్. కృష్ణారావు, ఆర్.వెంకటరత్నం, భావన్నారాయణ పాల్గొన్నారు.

సుందరయ్య కాలనీలో...

41వ డివిజన్ పుచ్చలపల్లి సుందరయ్య కాలనీలో సుందరయ్య జయంతిని షేక్ ఖాసీం షహీద్ అధ్యక్షతన గురువారం ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. ముందుగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. సీపీఎం నగర కార్యదర్శి నళినీకాంత్ మాట్లాడుతూ కార్మికుల రక్తతర్పణ వల్ల ఎర్ర జెండా పుట్టిందని తెలిపారు. సీఐటీయూ నగర్ కార్యదర్శి బి.ముత్యాలరావు మాట్లాడుతూ మేడే రోజే సుందరయ్య జన్మదినం కావడం విశేషమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సుందరయ్య నగర్ శాఖ కార్యదర్శి జి. లూథర్ పాల్ , సీనియర్ నేత ఆది నికల్సన్, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు షేక్ మస్తాన్ వలి, నాయకులు ఎస్. పద్మనాభుడు, మహిళా సంఘం నాయకులు బి. సుకన్య, నాయుడు పద్మ, ఎం. అచ్యుతకుమారి, తరుణ్, దేవరపల్లి సాగర్‌బాబు, ప్రభుదాసు కాలనీవాసులు పాల్గొన్నారు.

కులగణన ప్రకటనపై హర్షం

నెహ్రూనగర్: దేశవ్యాప్తంగా ఈసారి జరిగే జనగణనతో పాటు సమగ్ర కులగణన చేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటనపై బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు గురువారం హర్షం వ్యక్తం చేశారు. 1931 తరువాత ఇప్పటి వరకు ఏ ప్రభుత్వాలు కులగణనకు ముందుకు రాలేదని పేర్కొన్నారు. ఓబీసీ ప్రధాన నరేంద్రమోదీ నాయకత్వంలో ప్రభుత్వం కులగణన చేయడానికి ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు.

వర్చ్యువల్ క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ డ్రైవ్‌కు స్పందన

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో గురువారం నెల్లూరుకు చెందిన డివైన్ హెల్త్‌కేర్, ఒమేగా హెల్త్‌కేర్ సంయుక్తంగా వర్చ్యువల్ పద్ధతిలో నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ డ్రైవ్‌కు స్పందన లభించినట్లు ప్రిన్సిపాల్ ఎం.వి. నాగభూషణం తెలిపారు. వివిధ కళాశాలల నుంచి పాల్గొన్న 67 మంది విద్యార్థులకు డివైన్ హెల్త్‌కేర్ సహ వ్యవస్థాపకుడు విజయన్ శేఖర్ పర్యవేక్షణలో ట్రైనీ మెడికల్ కేడర్ ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. ఎంపికైన వారికి 15 రోజుల్లో జాబ్ ఆఫర్ లెటర్లు పంపనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్. మధుసూదనరావులు విజయన్ శేఖర్‌ను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ పి. సీతారామయ్య, ఏ. ప్రత్యూష, ప్లేస్‌మెంట్ సెల్ కో–ఆర్డినేటర్ డి. బ్రహ్మ శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.



విజయన్ శేఖర్‌ను సన్మానిస్తున్న జూపూడి రంగరాజు

నాట్య కళను రాబోయే తరాలకు అందించాలి



లక్ష్మీపురం: డిజిటల్ యుగంలో నాట్య కళను సజీవంగా కొనసాగించడానికి ప్రభుత్వాలు, రాజకీయ వ్యవస్థలు, స్వచ్ఛంద సంస్థలు చొరవ చూపాలని కళాకారులు, గాయకులు విజ్ఞప్తి చేశారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో అంతర్జాతీయ నృత్య దినోత్సవం సందర్భంగా 'నాట్య కళను యువత ప్రోత్సహించాలి' అనే కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ నాటక రచయిత, దర్శకుడు కావూరి సత్యనారాయణ మాట్లాడుతూ నాట్యం విశ్వభాష అని, ప్రపంచ ప్రజలను ఏకం చేయగల శక్తివంతమైన సాధనమని పేర్కొన్నారు. సంగీత విద్వాంసులు మల్లేశ్వరరావు మాట్లాడుతూ నాట్యం శిక్షణ ఇచ్చే గురువులను ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో గాయని యార్లగడ్డ లక్ష్మి, నాట్యరంగ ప్రముఖులు శ్రీనివాసులు పాల్గొన్నారు.